నవ్య, అక్టోబర్ 15, 2008

# నవతరం

ఆదివారం, మధ్యాహ్నమంతా రేవతి పెళ్లి గురించిన చర్చ సాగింది. మేనబావ సుందర్‌ని పెళ్లి చేసుకోమని పట్టుబట్టారంతా. సాయంత్రం నాలుగ్గంటల వరకూ ఇదే వరస. "మీరు ఎన్నయినా చెప్పండి! నేను సుందర్ బావను చేసుకోను. పేరుకి ఎంబిఏనే, కానీ మంచి ఉద్యోగం లేదు; రాదు కూడా. గల్లీగల్లీకీ ఎంబిఏలే" కుండబద్దలు కొట్టింది రేవతి. తల్లి కామేశ్వరి, తండ్రి శివరావు, తమ్ముడు సుధాకర్ – ఆమె నిర్ణయాన్ని విని ఊరుకున్నారు.

తల్లీదండ్రీ రేవతీ మేరేజ్‌బ్యూరోకి బయల్దేరారు. సుధాకర్ రానన్నాడు. ఇంట్లో నుంచి బయటికి వస్తూ చెప్పింది రేవతి. "డాడ్! ఈ సంబంధాలు చూడకండి. చెప్పాను గదా! వయస్సు ఇరవై నాలుగు ప్లస్, అంతే! ప్యాకేజీ మినిమమ్ లక్షన్నర డాలర్లకి తక్కువ ఉండకూడదు". మాటలు దృఢంగా, ఖరాఖండీగా ఉన్నై.

శివరావేమీ విస్తుపోయి చూడలేదు. కామేశ్వరీ ఏమీ కళ్లు విచ్చుకుని చూడలేదు.

ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. "అదుపు లేని గుఱ్రాలు అగడ్తలు దాటతాయంటారు మరి" గొణిగాడు శివరావ్. "భయమూ లేదు... భక్తీ లేదు... పెంకి ఘటం" భర్తకి మద్దతుగా తన మాటల్నీ కలిపింది కామేశ్వరి.

ఆటోరిక్షా పోతోంది....

దారిలో ఎవరూ ఎవరితోనూ మాట్లాడటం లేదు.

మొన్న బిటెక్ అయింది.... నిన్న ఉద్యోగంలో చేరింది.... ఇవ్వాళ ఇదీ వరస. ఇంటర్ దాకా పల్లెత్తి పలికేది కాదీ పిల్ల. లంగావోణీతో జూనియర్ కాలేజీకి వెళ్ళొచ్చేది. ఇంతలోనే ఎంత ఎదిగిపోయింది! వేషంలోనూ, భాషలోనూ ఆశ్చర్యకరమైన పరిణామం! ఆశలూ, ఆశయాలూ చెప్తోంది. జీవితం గురించీ, ఈ కాలం అవసరాల గురించీ వెయ్యి ఆలోచనలు వ్యక్తం చేస్తోంది. భవిష్యత్తూ, భద్రతా అంటూ ఊహలకు రెక్కలు తొడుగుతోంది.

శివరావ్ మనస్సులో ఇంతింత ఆశ్చర్యం. మేనల్లుడు సుందర్ ఎంబిఏ ఫైనాన్స్. ఏదో ఒక కంపెనీలో మంచి ఉద్యోగమే. అతని స్టేటస్ ఈ పిల్లకి ఆనటం లేదు! బావగారికి వైజాగ్‌లో గవర్నమెంట్ జాబ్.

'ఏకులాంటి పిల్ల మేకులా తయారైంది. కొరకరాని కొయ్య. ముందు ముందేం జరగనుందో' కామేశ్వరి మనసులో దిగులు.

'అమ్మా.. నాన్నా.. తమ్ముడూ.. నా గురించి ఏమన్నా అనుకోనీ, నా బాగు నాకు ముఖ్యం. నా ఇష్టమైనట్టు నేనుంటాను' రేవతి మనసులో నిశ్చయం. గంభీరంగా కూర్చుంది.

ఆలోచనల్లోంచీ తేరుకుని 'పక్కగా ఆపు' అన్నాడు శివరావ్. ఆటో ఆగింది. దిగారు. ఎదురుగానే మేరేజ్‌బ్యూరో ఆఫీసు.

నడివయస్సు మహిళ ఇన్‌ఛార్జ్. పేరు వసంత. కొన్ని సంబంధాలు చెప్పింది. కొన్ని కేసులు చూపింది. కొన్ని కాగితాలు వీళ్ల ముందు పెట్టింది. కంప్యూటర్‌లో కొన్ని వివరాలు చూపించింది.

'వయస్సు కుదిరితే ఇన్‌కమ్ సరిపోవటం లేదు' అన్నది వసంత. కుర్చీలో వెనక్కి వాలింది. 'ప్చ్'తో సరిపెట్టేసింది రేవతి. కళ్లతోనే మాట్లాడుకున్నారు ముగ్గురూ. "వస్తాం, చూస్తూ వుండండి.. ఏదైనా తగిలితే చెప్పండి" అని కదిలాడు శివరావ్. భార్యాకూతురూ ఆయన్ని అనుసరించారు.

'ఇరవై ఒకటికి ఇంజనీరింగవుతుంది. ఇరవైనాలుక్కి అంత ప్యాకేజీ రాదు. కష్టం! ఈ పిల్ల మరీ వోవర్‌యాంబీషస్. ఆ దొరికే వాడెవడో మనీమెషినైపోతాడు. 'పూర్‌ఫెలో", వెనక నుంచీ నవ్వు.

వసంత మాటలూ బాగానే వినపడినై.

చురుగ్గా తల్లికేసి చూసింది రేవతి. పక్కచూపులతో ముందుకు కదిలింది కామేశ్వరి. ఇంటికొచ్చేశారు.

ఆ రాత్రి....

హాల్లో కూర్చున్నారు నలుగురూ. చలిగాలి వీస్తోంది. వాన కురిసే సూచనలు చేస్తోంది ఆకాశం.

"నువ్వనుకున్నట్టు దొరికాడే అనుకుందాం. ఇవ్వాళ సంపాదిస్తూ ఉండొచ్చు. రేపు ఆ ఉద్యోగం ఊడితే...." సుధాకర్ అన్నాడు.

రేవతికి కోపమొచ్చింది.... "రేయ్ నువ్ ఎకడమిక్‌గా డిస్కస్ చెయ్యకురా" అంది కోపాన్ని నిగ్రహించుకుంటూ.

"అదీ ఆలోచించుకోవాలి" శివరావ్.

"కీడెంచి మేలెంచమన్నారు" కామేశ్వరి.

"బతుకంతా కీడెంచుకుంటూ కూచుంటే అడుగు ముందుకుపడదు."

"అసలు ఇరవై నాలుకల్లా అంత ప్యాకేజీ ఎలా వస్తుంది. బిటెక్ అయ్యేసరికి ఇరవై ఒకటీ ప్లస్ అవుతుంది" సుధాకర్ వయస్సు గురించి లాజిక్ లేవదీశాడు. "ఆ వసంత పరిహాసమూ అదే". అంటించింది తల్లి.

"ఏ ఎమ్మెస్సో చేసినవాడికి రాదా? నీ ఫస్ట్ బిటెక్ బుర్ర చాలదు లేరా.... ఇవన్నీ అర్థం చేసుకోవటానికి" అన్నది రేవతి.

"మీ అందరిదీ అసలు దిగులాగుడుతత్వం" అనీ అన్నది.

ముగ్గురూ ఉలిక్కిపడ్డారు. మరేమనాలో తోచలేదు. దిక్కులు చూస్తూ కూర్చుండిపోయారు.

బయట వానజల్లు మొదలైంది.

నాలుగు రోజులు తర్వాత.....

రాత్రి పొద్దుపోయి ఇల్లు చేరింది రేవతి. భోజనం చేస్తూ చెప్పింది. "ఇవ్వాళ వేరే వివాహవేదికకి వెళ్లొచ్చానమ్మా. ఒక కేస్ దొరికింది."

శివరావూ, సుధాకర్ కూడా వచ్చారు. "నీ కండిషన్స్ అన్నీ కుదిరియా మరి?" అడిగాడు సుధాకర్.

"వినరా..." అని నవ్వి "అన్నీ సరిపోయినై కానీ, అతను మరీ నాలుగు పది హైట్" అన్నది. తనలో తాను నవ్వుకుంది.

ముగ్గురూ తెల్లమొహాలు వేశారు. సుధాకర్ తెప్పరిల్లి అడిగాడు. "అయితే నీ మూడో కండిషన్ ఈ ఎత్తన్నమాట."

"అవును మరి. నేను ఐదూనాలుగు" అని కనుబొమలు ఎగరేసింది కించిత్ గర్వంగా.

"ఆపరేషన్ సక్సెస్ బట్ పేషంట్...." అర్థోక్తిలో ఆపేడు, సుధాకర్. తల్లీతండ్రీ నిస్పృహతో నిట్టూర్చాడు.

ఆ తర్వాత ఏమనాలో ఎవ్వరికీ తోచలేదు.

ఆదివారం ఉదయం పది గంటలకి రామచంద్రయ్య వచ్చాడు. ఆయనా, శివరావూ ముంబైలో కలిసి పనిచేశారు. అందరికీ బాగా తెలుసు. హాల్లో కూచుని పిచ్చాపాటీ - కబుర్లలో పడ్డారు. రేవతి పెళ్లి విషయం మాటల్లోకొచ్చింది.

"ఎవరో ఎందుకూ? మా శంకర్ లేడూ? రేవతికి ఈడూజోడూ. ఆమె అభిప్రాయం కనుక్కోండి. మీరవుననుకుంటే నేను వాడికి ఫోన్ చేస్తాను" అన్నాడు రామచంద్రయ్య.

ఒంటిగంటవుతుండగా సెలవు తీసుకున్నాడాయన.

ఆయన అటువెళ్లగానే ఇటు రేవతి తన అభిప్రాయం చెప్పింది. "శంకర్‌కి నలుగురు చెల్లెళ్లు. వాళ్ల చూపులెప్పుడూ మా వైపే ఉంటయ్. నాకిష్టం లేదు. అనవసరంగా ఈ విషయాన్ని పొడిగించకండి. ఆయనకి ఫోన్ చేసి చెప్పేయండి" అన్నది తండ్రినుద్దేశించి.

"కండిషన్ నాలుగు బయటకొచ్చింది" అని హాస్యమాడాడు సుధాకర్. రేవతి అదోలా అతన్ని చూసి, భోజనాలకి టేబుల్ సర్దడంలో నిమగ్నమయింది. తోచీతోచనట్టు దినపత్రికని చేతిలోకి తీసుకున్నాడు శివరావ్.

ఆ సాయంత్రం నలుగురూ కలిసి వేరే మేరేజ్‌లింక్స్ ఆఫీస్‌కి వెళ్లారు. బయల్దేరబోయే ముందు, "అసలు నీకీ పెళ్ళి తొందరెందుకే మా ప్రాణం తీస్తున్నావ్" అని జోక్ చేశాడు సుధాకర్.

"పూర్‌ఫెలో ఇది కూడా చెప్పాలా? అమెరికా లైఫ్ బాబా. యాజ్ ఎర్లీ యాజ్ పాజిబుల్, ప్లస్ మనీ, ఇట్ మేక్స్ మెనీ థింగ్స్ యు నో....." అని నవ్వేసింది రేవతి. సుధాకర్ అవాక్కయ్యాడు.

తల్లీతండ్రీ, రేవతి మనస్తత్వానికి గళ్ల నుడికట్టు జవాబులు ప్రయత్నిస్తున్నారు.

ఆ మర్నాడు సాయంత్రం......

ఆఫీసు నుంచీ రావటమే చిరాగ్గా, విసుగు పడుతూ ఇంటికొచ్చింది రేవతి. తల్లీదండ్రీ ఏమైందని అడిగారు. సుధాకర్ కూడా వాతావరణాన్ని ఆహ్లాదకరం చేస్తూ "ఏం తల్లీ ఏమన్నా వార్త తెచ్చావా?" అన్నాడు.

"అవున్రా! ఇవ్వాలో మంచి కేస్ తగిలింది నెట్‌లో."

"ఇంకేం హ్యాపీ హ్యాపీ కదా? చిరాకెందుకు?"

"విను చెప్తా" అని చెప్పసాగింది. "మన రిక్వయిర్‌మెంట్స్ అన్నీ సరిపోయినై. వయస్సు ఇరవై నాలుగేళ్ళ నాలుగు నెలలు. ఆదాయం ఒక లక్షా డెబ్భై డాలర్లు ఏడాదికి. ఎత్తు ఆరు అడుగులు."

"గ్రేట్.... ప్రొసీడ్" సుధాకర్.

"కానీ...." అని ఆగింది. ముగ్గుర్నీ తేరిపార చేసింది. ఎవరినోటా మాట లేదు. విస్మయమూ లేదు.... ఉత్సుకతా లేదు. నిరుత్సాహంగా నిట్టూర్చి చెప్పింది. "అమ్మాయ్ ఇండియాలోనే ఉండిపోవాలట. ఒక ఏడాది తరువాత అమెరికా ఉద్యోగం మానేసి ఇండియా వచ్చేసి ఇక్కడే ఉండిపోతాట్ట. చేస్తే ఉద్యోగం, లేకపోతే బిజినెస్ అంటున్నాడు చాటింగ్‌లో."

"ఇదీ బాగానే ఉంది" కామేశ్వరి. ఆమె కళ్లలో వెలుగు.

"కానీ నా ఆరోగ్యానికి పడదు కదా" అని విషయాన్ని ముగిస్తున్నట్టు ఏదో మేగజైన్ చేతిలోకి తీసుకుంది.

"చందమామరావే, జాబిల్లి రావే అయిపోతోందే అక్కా నీ సంబంధాల కథ" సరదాగా చిత్రంగా చేతులు తిప్పుతూ అన్నాడు సుధాకర్.

"నువ్ నోర్మూయ్యరా......" అంటూ తన గదిలోకి వెళ్లిపోయింది రేవతి.

అమ్మా నాన్నల వైపు అదోలా చూశాడు సుధాకర్. "మీరెందుకింత పట్టీపట్టనట్టు వుంటున్నారో అర్థం కావడం లేదు."

"మేం చెప్పటమంతా అయింది కదరా...." శివరావ్ నిస్పృహతో...

"అద్దాలనాటి బిడ్డలు కాదుగదా....." కామేశ్వరి నీరసం.

సోఫాలోంచీ లేచి సుధాకర్ కూడా తన గదిలోకి వెళ్లిపోయాడు.

శివరావ్ మనస్సులో తెలియని అలజడి రేగింది. తలపుల కలతలో పడ్డాడు. ఒక్కసారిగా తానేమిటో గుర్తుకొచ్చింది. బ్యాంక్‌లో గుమస్తాగా చేరి స్కేల్ త్రీ కొచ్చాడు. తొలిరోజుల్లో అతి కష్టం మీద ఈ కాలనీలో ఏర్పరచుకున్న ఇల్లు మాత్రమే తన స్థిరాస్తి. ఇద్దరే పిల్లలు. అయినా ఖర్చులు నానాటికీ పెరుగుతూనే వచ్చినై. రేవతి ఆశల సంగతి తెలిసిందే. సుధాకరయినా అక్కని, ఆటపట్టించడానికి అమ్మానాన్నల్ని వెనకేసుకొస్తున్నట్టు మాట్లాడతాడు కానీ, వాడూ వెయ్యి రూపాయలు లేని ప్యాంట్‌ని ఎంచుకోడు. బిటెక్ అయిన తర్వాత తప్పనిసరిగా ఎంబిఏ చేయాలనే కోరిక వాడికి. అన్నిటికీ డబ్బు కావాలి. ఇంటిని బిల్డర్‌లు అడుగుతున్నారు. అదీ తన ధైర్యం. రేవతి పెళ్లికి ఖర్చేమీ సాధారణంగా కాదని తనకు తెలుసు. ఆమె ఎత్తుకు ఎదిగేందుకు తనకున్న నిచ్చెన ఈ బిల్డింగే. అయినా, లోలోపల ఆమె పట్టుదలా, ప్రయత్నాలూ తననెక్కడికి తీసుకపోతాయో అనే భయం, దిగులూ తనకున్నాయి.

"ఆలోచన చాలుగానీ టిఫిన్‌కి లేవండీ" అన్న భార్య మాటలతో ఈ లోకంలోకొచ్చాడు శివరావు.

తెలతెలవారుతుండగా వచ్చాడు గంగాధరం. శివరావు బావగారు. పరామర్శలూ, కాఫీలు అయినై. హాల్లో కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు..... వీళ్లిద్దరూ, కామేశ్వరీ, బంధువర్గం గురించిన జ్ఞాపకాలూ, ఎవరెక్కడ వుంటున్నారో, ఏం చేస్తున్నారో అన్న వివరాలూ మాటల్లోకొచ్చినై. సుధాకర్, రేవతీ వచ్చి కూర్చున్నారు. పలకరింపులు అయినై. వాళ్లకే కాఫీ ఇచ్చింది కామేశ్వరి. టీవీలో వార్తలు నడుస్తున్నై.

అందరి వంకా చూస్తూ చెప్పుకొచ్చాడు గంగాధరం. "మన రేవతికో మంచి సంబంధం వుంది. నాకు తెలిసిన వాళ్లబ్బాయి.... వాళ్ళ నాన్న రియల్ ఎస్టేట్‌లో ఉన్నాడు. అమెరికా సంబంధమే. కాకపోతే, అతను వైజాగ్ వచ్చేస్తాడు. ఇక్కడే స్థిరపడతాడంటున్నారు."

వెంటనే ఠపీమని అనేసింది రేవతి "అత్తయ్య చెప్పిందిలే మామయ్యా! అతని తల్లికి ఇటీవల పెరాలిసిస్ వచ్చిందిట.

అదీ కారణం..... అతనీ దేశానికి వచ్చేస్తాననటానికి. నేనెక్కడ సేవలు చేయగలనావిడకు...వద్దులే"

అక్కవైపు చూస్తూ అన్నాడు సుధాకర్ "మా అక్క సంబంధాల వేట.... ఈగల వేటలా ఉందిలే మామయ్యా. మీకెందుకు శ్రమ! వదిలేయండి!"

అందరూ నవ్వుకున్నారు. తానేమో "నేను తయారు కావాలి. మా కంపెనీ బస్ టైమవుతుంది" అంటూ లేచింది రేవతి.

రేవతి ఆఫీస్‌కి వెళ్లేసరికి, ఆ హాలంతా కోలాహలంగా ఉంది. శృతి చుట్టూరా స్నేహబృందం. కేరింతలూ.... మాటలూ.... తాను దగ్గరకు వెళ్లింది.

వెడ్డింగ్‌కార్డు తీసిచ్చింది శృతి. "అభినందనలూ మరియు శుభాకాంక్షలూ" అని కళ్లు చికిలించింది రేవతి. "తెలుగు... తెలుగు...." అని జోకుల్లోకి దిగారు ఒకరిద్దరు కొలీగ్స్.

"అయితే భానుమూర్తే వరుడు. నైస్" అన్నది రేవతి కవర్‌లోని కార్డు తీసి పేర్లు చూస్తూ. భానుమూర్తీ, శృతి ప్రేమించుకున్నట్లు ఆఫీసులో చాలామంది సన్నిహితులకి తెలుసు. శృతి తల్లిదండ్రులకి ఇష్టం లేదు. వేరే సంబంధాలు చేస్తామన్నారు. శృతికి మాత్రం తాను వాళ్లని కన్విన్స్ చేయగలనని నమ్మకం. ఆమె నమ్మకం ఫలించిందన్న మాట అనుకుంది రేవతి. భానుమూర్తి అదే కంపెనీలో ఇదే వూళ్లో వేరే ఆఫీసులో పనిచేస్తున్నాడు.

ఇదంతా తలపుకొచ్చి "అయితే మొత్తానికి మీ పేరెంట్స్‌ని బాగానే మేనేజ్ చేశావ్ శృతీ" అన్నది రేవతి.

"యా..." అని "మా నాన్న చివరికో మాట మీద నా పక్షానికి మారాడు" విజయగర్వంతో అన్నది. పెళ్లి ఎప్పుడూ లాటరీయే నాన్నా! "నోన్ డెవిల్ ఈజ్ బెటర్‌దేన్.... అన్‌నోన్ డెవిల్" అని ఒక రోజు తీరిగ్గా చిన్న లెసన్ పీకాను. ఆయన కోసం చెప్పిన మాట కాదు. "ఐ రియల్లీ బిలీవిట్.... ఆనెస్ట్లీ, ఆమె వైపు ఆశ్చర్యంగా చూసింది రేవతి.

కొద్దిసేపటి తర్వాత ఎవరి సీట్లకి వాళ్లు కదిలారు. శృతి స్వీట్స్ తెప్పించే కార్యక్రమానికి పూనుకుంది.

వారం, పది రోజులు గడిచాయి.

ఈలోగా కొత్తగా సంబంధాల వార్తలేమీ లేవు. ఎవరి పనుల్లో వాళ్లు బిజీ అయిపోయారు.

కానీ,

రేవతి మాత్రం తన ఆలోచనల్లో తాను తలమున్కలైపోయింది. శృతి పెళ్లి కూడా అయిపోయింది. పెళ్లికి తానూ హాజరయింది.

రేవతి డిన్నర్ అయిన తర్వాత కొద్దిసేపు శృతి తండ్రితో మాట్లాడుతూ కూర్చుంది. పక్కన భానుమూర్తి ఉన్నాడు. కూతురి నుంచీ తాను అప్పుడప్పుడూ కొన్ని జీవితసత్యాల్ని నేర్చుకుంటూ వుంటానని, కొంచెం సీరియస్‌గానే చెప్పాడు శృతి తండ్రి.

వింతగా, ఉత్సుకతతో, సాలోచనగా వింటూ కూర్చుంది రేవతి.

భానుమూర్తి కూడా మామగారు చెప్పేది ఆలకిస్తున్నాడు.

ఆయనన్నాడు, “ఒకసారి శృతి వివేకానందుణ్ణి కోట్ చేసింది. ‘జీవితం మంచి కాదు, చెడూ కాదు, నువ్ చూసే చూపుని బట్టి ఉంటుంది’ అని.” గాలిలో చేతులాడిస్తూ మళ్లీ చెప్పాడు, “[illegible] ఏమైనా మా అమ్మాయి పెళ్లి లాటరీ, నోన్ డెవిల్ ఫిలాసఫీ మాత్రం నా బః  ఆనేసింది. నాకు జ్ఞానోదయమైంది” అని “ఇదిగో ఫలితంగా భానుమూర్తి అల్లుడైపోయాడు. అదృష్టవంతుడు” అని గొల్లున నవ్వేడు.

“మీరా, ఆయనా? నిజమైన అదృష్టవంతులు” అన్నది రేవతి, మరింత ఆహ్లాదాన్ని పంచుతూ.

“నో పాలిటిక్స్ ప్లీజ్” అని ముక్తసరిగా అని సన్నగా నవ్వేడు భానుమూర్తి.

రేవతికెందుకనో ఆ మాట ముచ్చటేసింది. “నైస్” అంది. ఆ వెంటనే “అయినా బుద్ధిమంతులకి పట్టువిడుపుల మర్మం తెలుసు. బతుకేమీ టెన్నిస్ రాకెట్ కాదు కదా అల్లుకుంటూ కూర్చోవటానికి” అనీ అన్నాడు భానుమూర్తి. మెచ్చుకోలుగా మామగారివైపు చూశాడు. శృతీ వాళ్ల నాన్నగారు టెన్నిస్ ప్లేయర్!

రేవతి భుజం మీద మృదు స్పర్శ. ఉలిక్కిపడి వెనక్కి చూసింది. కళ్యాణశోభతో కళకళలాడుతూ శృతి! అవ్యక్త ఆనందంతో శృతినీ, భానుమూర్తినీ చూస్తూ ఉండిపోయింది రేవతి.

మేధ చురుగ్గా పని చేస్తూనే వుంది. రేవతి కళ్ల ముందు ఆమెబావ - సుందర్! మనస్ఫూర్తిగా తనలో తాను నవ్వుకుంది! అటువైపు మళ్లీ సన్నాయి మొదలైంది.